మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# ఇందిరమ్మ ఇండ్ల రెండో దశకు శ్రీకారం

- గృహ నిర్మాణానికి ప్రభుత్వ సహాయం
- ఇందిరమ్మ ఇండ్లుకు ఇసుక ఉచితం
- లక్ష్య సాధన కోసం అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి
- అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలి
- హౌసింగ్ ఎండి. వీ.పీ గౌతమ్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండి. వీ.పీ గౌతమ్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లాలోని అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండి, వీ.పీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి జిల్లాలో మొదటి దశలో చేపట్టిన పైలెట్ గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఇందిరమ్మ ఇండ్ల రెండో దశలో ఎంపిక చేయనున్న లబ్ధిదారుల వివరాలపై రాష్ట్ర హౌసింగ్ ఎండి.వీ.పీగౌతమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాలు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట మున్సిపాలిటీల వారిగా ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీసి ఇందిరమ్మ ఇండ్ల వివరాలు అడిగి తెలుసుకొని, త్వరగా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎండి. వీ.పీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు మాట్లాడుతూ పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రామ, కమిటీలు గుర్తించిన వారితో పాటుగా ఎవరైనా నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇండ్లు ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక అయిన గ్రామాలు, వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో అధికారులు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్హులకు ఇండ్ల నిర్మాణాలపై సూచనలు అందించాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, సర్వే వివరాలు ప్రతి రోజూ సాయంత్రం తమకు పంపించాలని వారు సూచించారు. జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ల నిర్మాణాలను పూర్తి చేసి, లబ్ధిదారులకు మోడల్ హౌస్ నిర్మాణానికి 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇంటిని చూయించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను లబ్ధిదారులచే ఈనెల 9వ తేదీ లోపల ప్రారంభ పనులు చేపట్టాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల ౦ండో దశ మంజూరు పత్రాలను ఈ నెల 6వ తేదీ నాటికి లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎంపీడీవోలే పూర్తిస్థాయిలో బాధ్యత వహించాల్సి ఉంటుందని, అనర్హులను ఎంపిక చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి, గ్రామంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి హౌసింగ్ ఎండి. వీ.పీ గౌతమ్,ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవాలని లక్ష్యంగా ముందుకు పోతుందని తెలిపారు. వివిధ దశలలో పురోగతిలో ఉన్న ఇండ్లకు లబ్ధిదారులే ఫోటో తీసి పంపిన యెడల వారి ఖాతాలలో దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. మీ ఇంటికి ఎంత ఖర్చు అవుతుందో అంతే పెట్టుకోవాలని అదనంగా ఖర్చు చేసి అప్పుల పాలు కావద్దని హితవు పలికారు. ఇసుక ఉచితంగా లభిస్తుందని, రవాణా ఖర్చులు మాత్రమే లబ్ధిదారులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. స్వయంగా హౌసింగ్ ఎండి.వీపీ గౌతమ్ ఇందిర ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో క్షేత్రస్థాయిలో ఇండ్ల నిర్మాణ ప్రక్రియ సత్ఫలితాల దిశగా ముందుకు పోతుంది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి రూ.5 లక్షల రూపాయలతోనే మంచి ఇంటిని నిర్మించుకోవచ్చు అని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పథకం ద్వారా గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు ఒక వరంగా మారిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పిడి హౌసింగ్ సంగప్ప, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈ లు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్



గగ్గలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండి. వీ.పీ గౌతమ్

## రైతులకు వరి విత్తనాల పంపిణీ

- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధేయ్యం
- దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూధన్‌రెడ్డి



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, జూన్3 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని రైతు వేదిక వద్ద దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు చెందిన ఆదర్శ రైతులకు వ్యవసాయ శాఖ ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వారిచే అధిక దిగుబడినిచ్చే కంది, జొన్న, వరి సీడ్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధేయ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగా ఇచ్చిన మాట మేరకు రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రైతులకు వరి ధాన్యంపై 500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతుబంధు నెపంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పనిముట్లు, స్ప్రింక్లర్స్ సబ్సిడీలు ఇస్తూ,రైతులకు అన్నివిధాలుగా తోడ్పాటుగా నిలుస్తున్నామన్నారు. గతంలో నుండి –మిగతా4లో..

## గతంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- బిఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు ఇవ్వలే
- ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్3 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం తిరుమలగిరి, మునిమోక్షం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎవరికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని, వారి హయాంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటి హామీ అమలు చేస్తున్నామని, ప్రతి సంవత్సరం ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , 500 రూపాయలకే సిలిండర్ ఇస్తున్నామని,అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల వస్తాయని ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఒక్కోటిగా అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, బుద్దారం సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, చెన్నయ్య, నవనీత, షబ్బీర్ హుస్సేన్, యాదిరెడ్డి, రఘు దాసరి,శారద, రఘుపతి రెడ్డి, లింగం నాయక్, కేశవులు మండల తహశీల్దార్ కిష్ట్యానాయక్,ఎంపిడిఓ యశోద తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకం

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



అనంతపురం గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్

**గద్వాల, జూన్ 3,ప్రభాతవార్త:** గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకంగా మారుతోందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల్ మండలం అనంతపురం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ,రిజిస్ట్రార్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు,ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారి భూ సంబంధిత సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాలపై సూచనలు ఇచ్చారు. అధికారులకు తగిన మార్గదర్శకాలు తెలియజేసి, సమస్యలు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. భూ భారతి కార్యక్రమం ద్వారా గ్రామాలకు రెవెన్యూ అధికారులు వెళ్లి భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జూన్ 03 నుండి జూన్ 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.భూ సమస్యలు ఉంటే సంబంధిత ఫారం నింపి అధికారులకు అందజేయాలని రైతులకు సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం అన్ని దరఖాస్తులు స్వీకరించేంత వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల భూ సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఫారాల స్వీకరణ నుండి ఆన్‌లైన్ నమోదు వరకు ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరిగే భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఆర్డీఓ అలివేలు, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్,రెవిన్యూ సిబ్బంది, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సియంఆర్ క్లియర్ చేసి మిల్లింగ్ కొనసాగించాలి

- ప్రభుత్వం ఇచ్చిన వడ్లు తీసుకోకుండా ప్రైవేటుగా వడ్లు తీసుకొని మిల్లింగ్ చేసే మిల్లులపై చర్యలు కఠినంగా ఉంటాయి
- పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్

**వనపర్తి టౌన్, జూన్ 3 ప్రభాతవార్త :** వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉన్న రైస్ మిల్లులు సగానికి పైగా డిఫాల్ట్ అయి ఉండటం ధాన్యం సేకరణకు ప్రధాన సమస్యగా మారిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ అన్నారు. మంగళవారం ఉదయం వనపర్తి జిల్లా ఐడిఓసి సమావేశ మందిరంలో వరి కొనుగోలు పై వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లా అధికారులు, మిల్లర్లు, ఐకేపి, పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్, వనపర్తి అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు. సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ వరి కొనుగోలు విషయంలో రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వస్తుందని అన్నారు. దీనికి ప్రధాన కారణం వనపర్తి జిల్లాలో 184 రైస్ మిల్లులు ఉండగా సగానికి పైగా డిఫాల్ట్ అయి ధాన్యం తీసుకోవడంలో దూరంగా ఉండటం ఏంటని విస్మయం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సైతం సగానికి పైగా మిల్లులు డిఫాల్ట్ అయ్యాయన్నారు. వనపర్తి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి అయితే మిల్లింగ్ చేయడానికి మిల్లులు లేకపోతే మిల్లింగ్ ఎవరు చేస్తారని ప్రశ్నించారు. తాత్కాలికంగా గోదాముల్లో నిల్వ చేసినప్పటికీ అంతిమంగా తిరిగి మిల్లులకు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి వడ్లు తీసుకోకుండా గట్టిగా ప్రైవేట్ వడ్లు తీసుకొని మిల్లింగ్ చేస్తున్న డిఫాల్ట్ మిల్లుల పై చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డిఫాల్ట్ మిల్లర్లు పాత సి.యం.ఆర్. ను క్లియర్ చేసి ప్రభుత్వం నుండి వడ్లు తీసుకోడానికి ముందుకు రావాలని, సి.యం.ఆర్ క్లియర్ చేసిన వారికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు మిల్లుకు రాకపోవడం వల్ల క్వింటాలుకు 67 కిలోలు రావాల్సిన బియ్యం 62 కిలోలు మాత్రమే వస్తుందని, తద్వారా మిల్లరు నష్టపోతున్నారని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎఫ్‌ఎక్యూ ప్రకారంగా వడ్లు రావడంలేదని మిల్లర్లు చెప్పడం సరికాదని, కొనుగోలు కేంద్రాలకు ఆధునిక పాడి క్లీనర్లు, ఎండబెట్టే యంత్రాలు, సరిపడా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచి సరైన తేమశాతం వచ్చాకే తూకం చేసి మిల్లులకు పంపించడం జరుగుతుందన్నారు. వనపర్తి జిల్లాకు మరికొన్ని పాడి క్లీనర్ లు, వాక్యూమ్ పాడి క్లీనర్ లు పంపించడం జరుగుతుందని, తడిచిన ధాన్యం సైతం యంత్రాల ద్వారా ఎండబెట్టి తాలు, చెత్త లేకుండా సరైన తేమతో కొనుగోలు చేసి మిల్లులకు పంపించడం జరుగుతుందన్నారు. యంత్రాల ద్వారా వరి కోతలు చేసే సమయంలో 18 నుంచి 20 ఆర్పీఎం, గేర్ స్నాట్ బి1 లో ఉంచడం, బ్లోయర్ ఆన్‌లో పెట్టుకొని వరి కోతలు చేసే విధంగా చూడాలని, నిబంధనలు పాటించని హార్వెస్టర్ల పై కేసులు నమోదు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. సమీక్షలు పాల్గొన్న వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గత 10 అవ తారాల్లో ఏ రబీ లోనూ లేని విధంగా ఈసారి వనపర్తి జిల్లాలో అత్యధికంగా వరి పండిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి రూ. 571కోట్లు 39145 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మొత్తం 415 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 253 కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలు పూర్తి అయిందన్నారు. మరో 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని తెలియజేశారు. జిల్లాలో 184 మిల్లులకు గాను డిఫాల్ట్ మిల్లులు పోను కేవలం 77 మిల్లులకు మాత్రమే వడ్లు కేటాయించడం జరిగిందని అయినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్, వనపర్తి సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం లు, జిల్లా అధికారులు, మిల్లర్లు, ఐకేపి, పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## డిజైన్ ఆధారంగా ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 3 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్, సాంకేతికతకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర కోరారు. మంగళవారం ఆమె రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. కాగా రంగారెడ్డి గూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 75 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13 ఇండ్లకు సంబంధించి బేస్మెంట్లు, 25 ఇండ్లు నిర్మాణంకు మార్కింగ్ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు ఆంజనేయులుతో మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో బేస్‌మెంట్ నిర్మించారు అని కలెక్టర్ అడిగారు. 547 చదరపు అడుగులలో నిర్మించినట్లు లబ్దిదారుడు తెలిపారు. ఇల్లు కట్టడానికి ఎంత ఖర్చు అవుతుందని అని అడిగారు.10 లక్షలు అవుతుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్ ప్రకారం యూనిట్ కాస్ట్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచించిన విధంగా ఇండ్లు నిర్మించుకోవాలని,ఎక్కువ ఖర్చు చేసి అప్పుల పాలు కావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇసుక సరఫరా గురించి తెలుసుకున్నారు.లబ్దిదారులకు కావలసిన ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని సూచించారు.ఇండ్లు మంజూరు చేసిన లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకునేలా అధికారులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు అవగాహన కలిగించాలని అన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

**జడ్చర్ల (బాలానగర్) జూన్ 3 ప్రభాతవార్త :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బాలానగర్ మండలం కేతెరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖా ముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోం దని కలెక్టర్ స్పష్టం చేశారు. తహసీల్దార్,నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టాపాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, కెఎస్ఆర్ వెంకట్ రెడ్డి, నయాబ్ తహసిల్దార్ లిఖిత రెడ్డి, రెవిన్యూ సిబ్బందితో పాటు మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**పెబ్బేరు, జూన్3 ప్రభాతవార్త:** శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్లో హోంగార్డ్ గా పనిచేస్తున్న శ్రీనివాసులు పెబ్బేరు పట్టణ కేంద్రంలో కరాటే శిక్షణా శిబిరాన్ని నిర్వహించి స్థానిక విద్యార్థినీ విద్యార్థులకు కరాటేను నేర్పించారు. తను నేర్పించిన శిక్షణ శిబిరం కరాటేలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు వారి స్థాయికి తగ్గట్లుగా మంగళవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ కరాటే విద్యార్థులకు బెల్టుల, సర్టిఫికెట్స్ అందజేసారు.ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ కరాటే సాధన చేయడంవల్ల విద్యార్థి యొక్క నైపుణ్యాలు మరియు జ్ఞానాన్ని వారి జీవనవిధానం పనితీరు పట్టుదలను పెంచుతాయని. కరాటే బెల్ట్ ప్రదానం ఒక ప్రేరణగా పనిచేస్తుందన్నారు. కరాటే శిక్షణ ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి సహాయపడుతుంది ఇది ఒక వ్యక్తిలో ధైర్యం ఆత్మవిశ్వాసం మరియు నమ్మకాన్ని పెంచుతుందని కరాటే మానసిక,సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచగలవని తెలియజేసారు.కరాటే శిక్షణ పొందడం ద్వారా లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ధైర్యాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. భయాన్ని నిరాశను తగ్గిస్తుందని సవాళ్ళను ఎదుర్కోవడానికి కావలసిన ధైర్యాన్ని కరాటే పెంచుతుందని వారు తెలియజేశారు.మానసిక దృఢత్వం పొందవచ్చు శరీరాన్ని బలంగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు మనసును ప్రశాంతంగా ఒత్తిడిని ఆందోళనను తగ్గించుకోవడానికి కరాటే తోడ్పడుతుందనివారు ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఈ బెల్టులు కరాటేలో వారి స్థాయిని సూచిస్తాయని భవిష్యత్తుకు ప్రేరణనిస్తాయని ఈ కార్యక్రమం మా పోలీస్ డిపార్ట్ మెంట్ నుండు –మిగతా4లో..



విద్యార్థులకు బెల్టులు అందజేసి అభినందిస్తున్న జిల్లా ఎస్పీ

# భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

◆ జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం
◆ రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం అమలు
◆ జిల్లాలో 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల ప్రణాళిక
◆ భూ రికార్డుల లోపాలకు సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారం
◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


భూ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్3 ప్రభాతవార్త:** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించనున్న భూభారతి కింద రెవెన్యూ సదస్సుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు చేపట్టగా, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని మిగతా 19 మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసిల్దార్ల నేతృత్వంలో 2 బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో 2 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14వ తేదీ లోపు భుభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. నిర్ణీత షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలోఅధికారులు ఉదయం నుండిసాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణకోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ చేయూత


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 3 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మారం రాకేష్, రాఘవేందర్లు వ్యాపార, వాణిజ్య సముదాయాలు అగ్ని ప్రమాదం భారినపడి లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఆ సమయంలో బాధిత కుటుంబాలను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు, శ్రీశైల మల్లికార్జున సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మంగళవారం బాధిత సోదరులు రాకేష్, రాఘవేందర్‌లకు రూ.1 లక్ష 7వేల ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లాలో ఆర్యవైశ్యులకు ఎప్పుడు అండగా ఉంటామని మిడిదొడ్డి శ్యాంసుందర్, బచ్చు రామకృష్ణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి విసన కర్రల చంద్రకుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుల్లపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి శివజగదీశ్వర్, నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిళ్ళకంటి రవికుమార్, మాజీ ఎంపీటీసీ కలిమిచెర్ల గోపాల్, వెల్దండ మండల శాఖ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, వంగూర్ మండలశాఖ అధ్యక్షుడు మేడిశెట్టి సురేష్, పారిశ్రామికవేత్త దత్తాత్రేయులు, గుబ్బ కిషన్, నారాయణరాజు, గుగ్గిల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ మొదలైన ఇథనాల్ ఫ్యాక్టరీ రగడ

### రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

**మానవపాడు, జూన్ 3 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడలో నిర్మాణం చేపడుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు మళ్లీ మొదలయ్యాయి. దీంతో సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు మళ్ళీ రోడ్డుపై బైఠాయించి ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని మంగళవారం ధర్నా చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా పనులు ప్రారంభించేందుకు కంపెనీ యాజమాన్యం ప్రైవేటు వ్యక్తులను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలు చేయడంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోరాట కమిటీ ప్రకటించింది. రాత్రి వేళల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కంౕటెనర్లు, టిప్పర్లు, హిటాచీలను ప్రైవేటు వ్యక్తులను పెద్దధన్వాడలోని నిర్మాణ స్థలంలోకి తీసుకొచ్చారు. గత ఆరునెలలుగా 12 గ్రామాల ప్రజలు క్యాన్సర్ కారకాలు, విషాన్ని పెట్టే ఫ్యాక్టరీని నిర్మించవద్దని పలు రకాల నిరసన నిరహార దీక్షలు కొనసాగించాము. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఇంచార్జి సంపత్ కుమార్ హామీతో దీక్షలు విరమించామని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసే వరకు పోరాడుతామని సందర్భంగా వారు హెచ్చరించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

## లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**ఊట్కూరు, జూన్ 3 ప్రభాతవార్త :** ఊట్కూరు మండలంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దగ్గర కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, సీఎం సహాయనిది చెక్కులను లబ్ధిదారులకు మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరి 9 నెలలకు ఒకసారి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఇవ్వకుండా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ 18 నెలల్లోని ఒక్క ఊట్కూరు మండలానికి సీఎం సహాయనిధి ద్వారా రూ.90 లక్షలను చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఎమ్మార్వో చింత రవి, బిఏసిఎస్ చైర్మన్ బాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కోరం మహేష్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు కుక్కలింగం, మాజీ పిఏసిఎస్ చైర్మన్ ఎల్కోటి నారాయణరెడ్డి, మల్లెపల్లి మాజీ సర్పంచ్ కథలప్ప, వివిధ గ్రామాల అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**నవాబుపేట, జూన్ 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండాపూర్ అజిలాపూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు తహసిల్దార్ శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. మంగళవారం నుండి 20 వ తారీకు వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. భూ యజమానులు రైతులు తమ భూమి రికార్డుల యందు ఏమైనా తప్పులు ఉన్నా లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల యందు పేరు నమోదు కాకపోయినా మరి ఇతర భూ సమస్యలు ఉన్న గ్రామాల వారిగా నిర్వహించే ఈ రెవెన్యూ సదస్సులో రైతుల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని మండల అధికారులు సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ప్రతి గ్రామంలో నిర్వహించబడతాయని రైతులకు సూచించారు.

# బీఆర్ఎస్ కళ్లున్న కబోది

● 16 నెలల్లో రైతులకు వేలకోట్ల నిధులు
● కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం
● రైతు బంధు ఒక్కటే అమలు చేసిన గత ప్రభుత్వం
● దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)
● భూత్పూర్‌లో రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే జీఎంఆర్‌చే విత్తనాలను అందుకుంటున్న భట్టుపల్లి రైతు రేకులపాటి భూపతిరెడ్డి

**భూత్పూర్, జూన్ 3, ప్రభాతవార్త :** గత పదేండ్లలో రైతులకు జరగని సంక్షేమం ఏడాదిన్నరలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంఅమలు చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు. గత ప్రభుత్వం కేవలం రైతు బంధు ఒక్కటే అమలుచేసి మిగతా రైతు సంక్షేమ పథకాలకు తిలోదకాలిచ్చిందని విమర్శించారు. మంగళవారం భూత్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మూడు మండలాల(భూత్పూర్, మూసాపేట్, అడ్డాకుల)నుంచి ఎంపిక చేసిన దాదాపుగా రెండొందల మంది రైతులకు ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు తయారు చేసిన వరి, కంది, జొన్నలకు చెందిన మేలైన వంగడాలను(విత్తనాలను) మూడు మండలాల్లోని ఒక్కో గ్రామం నుంచి ఎంపిక చేసిన ముగ్గరేసి మంది రైతులకు దాదాపుగా 200 మందికి ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కేటీఆర్, హరీశ్‌రావునోటికి హద్దుఅదుపులేకుండా మాట్లాడుతున్నారని, గత పదేళ్లలో జరగని అభివృద్ధి తమ పదహారు నెలలలో జరదాన్ని బీఆర్ఎస్‌నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. అభివృద్ధిని చూడని బీఆర్ఎస్ నాయకులు కళ్లున్న కబోదులను విమర్శించారు. వేల కోట్లు దండుకున్న గత పాలకులు తమ నిజాయితీ ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తెలంగాణవాదులమని చెప్పుకునే బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎంకేసీఆర్ తెలంగాణ ఆవిర్భావం రోజునఎక్కడా ఏ కార్యక్రమంలో పాల్గొనక పోవడం, తెలంగాణ ప్రజలకు అవతరణ శుభాకాంక్షలు తెల్పకపోవడం తెలంగాణ పట్ల, తెలంగాణ ప్రజల పట్ల ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తోందని ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శించారు. బీఆర్ఎస్‌లో దెయ్యాలున్నాయని కేసీఆర్ కూతురే పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇలాంటి దెయ్యాలను గ్రామాల్లో తిరగనీయవద్దని అన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన భూత్పూర్ మండలానికి చెందిన దాదాపు 1100మంది రైతులకు ఒక్కొక్కరికి ఎకరాకు రు.10వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వరి, కంది, జొన్న పంటలకు సంబంధించి ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తయారు చేసిన మేలైన విత్తనాలను రైతులు సకాలంలో విత్తుకుని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. ఎంపిక చేసిన మూడు మండలాలకు చెందిన రైతులకు భూత్పూర్ మండలానికి చెందిన రైతులకు 48కిట్లు, అడ్డాకులమండలానికి చెందిన రైతులకు 42కిట్లు, మూసాపేట్ మండలానికి చెందిన రైతులకు 39కిట్ల నాణ్యమైన విత్తనాలను ఎమ్మెల్యే జీఎంఆర్ అందజేశారు.


భూత్పూర్ రైతు వేదిక సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**కేవలం వరినే వేయకూడదు...**

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**

తమ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుందని రైతులందరూ వరి పంటనే వేస్తున్నారని, ఇలా కాకుండా ఆరుతడి పంటలైన జొన్న, కంది పంటలపై రైతులు తమ దృష్టిని సారించాలని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. భూత్పూర్ మండలంలో గతేడాది సన్నాలకు బోనస్‌గా రు.3,77కోట్లను తమ ప్రభుత్వం చెల్లించిందని కేసీరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు మాధవి, రమ్యలతో పాటు మండల వ్యవసాయాధికారి మురళిధర్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, భూత్పూర్ మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డిలతో పాటు నాయకులు లిక్కి విజయ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, కిట్టురెడ్డి, వెంకటేష్, నర్సింహులు, అడ్డాకుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, దెందు లక్ష్మీకాంత్‌రెడ్డి, తమన్నగౌడ్, బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్పతో పాటు మూడు మండలాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులు పక్కాగా నిర్వహించాలి

– జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు


అన్నాసాగర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ధరఖాస్తుదారుతో మాట్లాడుతున్న అడీషనల్ కలెక్టర్ మోహన్‌రావు

**భూత్పూర్, జూన్3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం సూచించిన ప్రకారం పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)మోహన్‌రావు సూచించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా ఆయన అడ్డాకుల మండలం శాఖాపూర్, భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు. అన్నాసాగర్‌లో నిర్వహించిన భూభారతిలో పాల్గొని వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సదస్సులో ప్రజలు, రైతుల నుంచి 8 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అడీషనల్ కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం–2025 ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3నుంచి 20వరకు 18రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ గ్రామాల్లో విరివిగా సదస్సులు నిర్వహించి భూసమస్యలున్న రైతుల నుంచి ధరఖాస్తులు స్వీకరించి పరిష్కారం చేయనున్నట్లు అడీషనల్ కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మూసాపేట్ మండలంలో ఇదివరకే రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత ఆయా మండలాల తహశిల్దార్లు పూర్తిస్థాయిలో రెవెన్యూ గ్రామాలలోవిస్తృతంగా ప్రచారం నిర్వహించి, ప్రజలు, రైతుల్ని చైతన్య పరిచారని పేర్కొన్నారు. ధరఖాస్తుదారులకు ముందస్తు ఫారాలు అందిస్తున్నామని, తద్వారా ధరఖాస్తుదారుడు ఇచ్చిన ధరఖాస్తులను నిశితంగా పరిశీలించి పరిష్కరించేదిశగా అడుగేయాలని అడీషనల్ కలెక్టర్‌మోహన్‌రావు సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల డిప్యూటీ తహశిల్దార్ గీత ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పై ఆంజనేయులు

**నారాయణపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త:** మితిమీరిన వేగంతో వాహనాలు నడప రాదని ఏఎస్పై ఆంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మరియు మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని తెలిపారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తాలో ఏఎస్పై ఆంజనేయులు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వారికి జరిమానా విధిస్తూ, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పై ఆంజనేయులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ మితిమీరిన వేగంతో ఓవర్ స్పీడ్‌గా వాహనాలు నడపరాదని మరియు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. వాహనదారు మద్యం సేవించివాహనాలు నడపరాదని మద్యంసేవించి వాహనాలు నడపడం వల్ల చాలావరకు రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయని మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే కార్ అద్దలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించరాదని ఎవరైనా కార్ అద్దాల కు బ్లాక్ ఫిలింఉపయోగిస్తే వారిపైకేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కొన్ని సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించవలెను. వాహనదారులు ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదు. టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదు. సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపరాదు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను మరియు కూలీలను ఎక్కించుకోరాదు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలి. మితిమీరిన వేగంతో వాహనాలను నడప రాదని సూచించారు. పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## గోవులు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

● మూడు కోడెదూడలు, ఒక ఆవు మృతి
● ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు


తనిఖీల్లో పోలీసులు పట్టుకున్న గోవులు

**మానవపాడు, జూన్ 3 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం జాతీయ రహదారిపై పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్‌లో 48 కోడెదూడలు, 31 ఆవులను పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాహనాన్ని, కంటైనర్ డ్రైవర్ అబ్దుల్ అజీజ్‌ని అదుపులోకి తీసుకొని గోవులను ఖరీదు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఖలీల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అయితే భారీ కంటైనర్ లో గోవులను గట్టిగా కట్టేసి తరలిస్తున్న క్రమంలో మూడు కోడెదూడలు ఒక ఆవు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. 79 ఆవుల ఖరీదు 6,75,000ఉంటుందని తెలిపారు. పట్టుబడిన గోవులను మానవపాడు ఉన్నత పాఠశాల ఆవరణలోకి తరలించి గో సంరక్షణ కొరకు ఎవరైతే ముందుకు వస్తారో వారికి అప్పజెప్పారు.

## విద్యుత్ లైన్లను పరిశీలించిన ఏడి

**వెల్దండ, జూన్ 3 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో విద్యుత్తు స్తంభాల లైన్లను ఏఈ జానకిరామ్‌తో కలిసి ఏడి శంకరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడి శంకరయ్య మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో విద్యుత్తు లైన్లు, స్తంభాలు ఎలా ఉన్నాయని ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందని, విద్యుత్ స్తంభాలు ఒరిగిన, విరిగిపోయినట్లు విద్యుత్తు లైన్లు బలహీనంగా ఉన్న యాప్లో నమోదు చేసి అనుమతులు వచ్చిన వెంటనే వాటి స్థానంలో నూతన స్తంభాలు, విద్యుత్తు తీగలు ఇంకేమైనా సాంకేతిక మమ్మతులు ఉంటే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ అంకిత, లైన్‌మెన్ లక్ష్మణ్‌లు ఉన్నారు

## కొనసాగుతున్న నాణ్యమైన విత్తనాల పంపిణీ

**ఉప్పునుంతల, జూన్3 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జయశంకర్ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న విత్తనోత్పత్తి అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు మంగళవారం స్థానిక రైతు వేదికలో రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మంగళవారం మండల వ్యవసాయ అధికారి రమేష్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ బానుశ్రీ సమక్షంలో రెవెన్యూ గ్రామాల్లో ఎంపికైన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. వరిరకం కెఎన్ఎం 1638 రకం పిఐపిఎస్ 2 విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం.ఎఆర్ బాను శ్రీ, మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్, మండల వ్యవసాయశాఖ విస్తీర్ణ అధికారులు శ్రీలలిత ,మంజుల, మహేష్ ,సుమతి, సంధ్య, సంతోష్, చిన్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ

**ఉప్పునుంతల, జూన్3 ప్రభాతవార్త:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ సంవత్సరం చదువుకునే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎంఆర్సి కార్యాలయం వద్ద పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థుల ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేశారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల లకు పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి వివరించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండలంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం జంగయ్య, శ్రీరాములు, శ్రీనివాసులు, కేశవరావు, రమేష్, అన్ని పాఠశాల ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రదర్శనకు ఎంపికైన పిడి బి.రూప

**నారాయణ పేట, జూన్ 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసన పరిస్థితులపై (బెస్ట్ ప్రాక్టీస్) నిర్వహించిన జిల్లా స్థాయి విద్య ప్రదర్శనలో 53 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా, జిల్లా కమిటీ చైర్ పర్సన్ అయిన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో రాష్ట్రస్థాయికి, జిల్లా నుండి మక్తల్ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని ఫిజికల్ డైరెక్టర్ బి.రూప ఎంపికైనట్లు, జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి సమాచారం అందినట్లు, బి. రూప సంతోషాన్ని వ్యక్తపరుస్తూ తెలియజేశారు. ఈ నెల 3న హైదరాబాద్‌లోని డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి మండల విద్యాశాఖ అధికారులకు ఇచ్చే శిక్షణలో పాల్గొను, మండల విద్యాశాఖ అధికారుల సమావేశంలో, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి అభ్యసన ప్రక్రియ ప్రదర్శనలకు రాష్ట్రస్థాయికి ఎంపికైనఉపాధ్యాయులందరూ పాల్గొనే ప్రదర్శన కార్యక్రమంలో బి.రూప పాఠశాలలో వ్యాయామ విద్య, కో సర్క్యులర్ ఆక్టివిటీస్ పై ప్రదర్శించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రదర్శనకు ఎంపికైన పిడిబి.రూపను పాఠశాల జీహెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ చూపిన పానుగల్ యువకుడు

**పానుగల్, జూన్ 3, ప్రభాతవార్త;** పానుగల్ మండలంలోని షాగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లపాగ చంద్రయ్య కుమారుడు ఎల్లపాక రామ్ చరణ్ ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో ప్రతిభ చూపాడు. రామ్ చరణ్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలకు హాజరయ్యాడు. ప్రభుత్వం వెల్లడించిన ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 2033. ర్యాంకు సాధించి ఉత్తమప్రతిభను చాటాడు దీంతో సహచరులు అధ్యాపకులు, సహచరులు, రామ్‌చరణ్‌ను అభినందించారు.

## గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు

**ఇటిక్యాల, జూన్ 3 ప్రభాతవార్త :** ఉమ్మడి మండలంలోని గ్రామాలలో గల గొర్రెలు. మేకలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చిటుక వ్యాధి రాకుండా వాటికి వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేయనున్నట్లు ఈ కార్యక్రమం ఈనెల 27వ తేదీ వరకు గ్రామాలలో కొనసాగుతుందని ఈ అవకాశం మేకల గొర్రెల యజమానుల సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య డా. వినయ్ కుమార్, భువనేశ్వరి సూచించారు. అందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొండపేట గ్రామంలో మేకలకు గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేయగా ఇందులో 1670 గొర్రెలకు. 192 మేకలకు టీకాలు వేసి వేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దేవన్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాల పంపిణీ



సబ్సిడి విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, జూన్3 ప్రభాతవార్త :** రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న ఉచిత విత్తనాల పంపిణీలో భాగంగా మంగళవారం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రం రైతు వేదికలో మండల రైతులకు పాక్స్ ఛైర్మన్ పుట్టి ఈదప్ప, వ్యవసాయ అధికారి మణిచందర్ వ్యవసాయ విస్తరణ అధికారులు శివజ్యోతి, అజయ్, గోపాల్, రవి, నరేష్ రైతులకు నాణ్యమైన విత్తనా లను పంపిణీ చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబడులు కనీసం 1015 శాతం వరకు పెరిగే అవకాశాన్ని రైతులకు తెలియ జేయడం.రైతులు ఒకసారి నాణ్య మైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా సేక రించి, కొన్ని సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని 23 సంవత్సరాల వరకు వాడుకో వచ్చు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందించబడుతుంది. ఎంపికైన రైతులకు విత్తనోత్పత్తిపై వ్యవ సాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించ బడతాయిఅన్నారు. ఈపథకాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మరియు వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ వర్సిటి ఛాన్సలర్ అల్దాస్ జానయ్య సూచనలతో జూన్ 2వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అధికా రికంగా ప్రారంభించబడింది.ఈ విధంగా విత్తన సాంకేతికతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా, రానున్న 23 సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే కాక, తెలం గాణ రాష్ట్రాన్ని విత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికార సిబ్బందితో బాటు తదితరులు ఉన్నారు.

### నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం

## వినూత్న కార్యక్రమం ప్రారంభం

**మాగనూరు, జూన్3 ప్రభాతవార్త :** పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం "నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం" అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కార్యక్రమలో భాగంగా నారాయణపేట జిల్లా, మాగ నూర్ మండలంలో విత్తన పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. ఈశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్రాంతీయ పరిశోధన స్థానం, పాలెం), సుదర్శన్‌గౌడ్ మండల వ్యవసాయ అధికారి, ఆనంద్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు. రైతులకు 35 కిట్లు వరి 25 కిట్లు కంది పంటలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం: ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబ డులు కనీసం 1015 శాతం వరకు పెరిగే అవకాశాన్ని రైతులకు తెలియజేయడం. రైతులు ఒకసారి నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా సేకరించి, కొన్ని సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని 23 సంవత్సరాల వరకు వాడుకోవచ్చు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురు నుండి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందించబడుతుంది. ఎంపికైన రైతులకు విత్తనోత్పత్తిపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించబడ తాయి.ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు, వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో జూన్ 2వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించబడింది.ఈ విధంగా విత్తన సాంకేతికతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా,రానున్న 23 సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే కాక, తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుంది.

## భూ భారతితోనే భూ సమస్యల పరిష్కారం

- రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి
- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**చిన్న చింతకుంట, జూన్ 3 ప్రభాతవార్త :** రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి రెవెన్యూ చట్టం ఎంతో దోహదపడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం భూభారతి గ్రామరెవెన్యూ సదస్సులో భాగంగామండలంలోని ఎదలాపూర్ గ్రామం లో భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం రెవిన్యూ చట్టం ధరణి ద్వారా రైతులు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారని,గత కెసిఆర్ ప్రభుత్వం ధరణి ద్వారా వారి కుటుంబ భూములను కాపాడుకునేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చార న్నారు. ప్రజలకు ఉపయోగపడే చట్టాలను తీసుకురావడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి రాగానే ధరణి రద్దుచేసి భూభారతి చట్టాన్ని తీసుకొస్తామని ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.ఈ భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆయన తెలిపారు.ఆయా గ్రామాల్లోని రైతులు తమ భూ సమస్యలను ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా రైతుల వద్దకే ప్రజా పాలన అనే నినాదంతో ప్రతిరోజు ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసి ఆ గ్రామం లోని రైతులకు సంబంధించిన భూ సమస్యలను అక్కడే అధికారులు పరిష్కారం చూపుతారని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ రెవెన్యూ సదస్సుకు భూ సమ స్యల గాను నాలుగు దరఖాస్తులు రావడం జరిగిందని తహసిల్దార్ ఎల్లన్న తెలిపారు. మూడింటిని పరిష్కరించి ఒకటి రిజెక్ట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందిస్తే అధిక దిగుబడి సాధించుకుంటారని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తెలిపారు.ఎదలపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోఆదర్శ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేశారు.రైతు సంక్షే మమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆ దిశగా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందన్న నినాదంతో రైతు సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తూ రైతు బిడ్డ అయిన రేవంత్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ముగ్గురు ఆదర్శ రైతులకు చొప్పున మండలంలోని 51 మంది ఆదర్శ రైతులకు వరి, కంది, జొన్న విత్తనాల బస్తాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కథలప్ప, విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు రంజిత్ రెడ్డి ,వ్యవసాయ శాస్త్రవేత్త నలిని, ఏవో రాజేష్ కన్నా, డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్,గ్రామపార్టీ అధ్యక్షులు కొండారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఉషన్న గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, గంజి బాలరాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలి

**అమరచింత జూన్ 3 ప్రభాతవార్త :** రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని కొత్తకోట డివిజన్ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రైతులను కోరారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నాగల్ కడుమూర్ గ్రామ రైతు వేదికలో రైతులకు మినీ కిట్టు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ వ్యవసాయ పొలాలకు విత్తనాలు విక్రయ సమయంలో ఎరువుల దుకాణాలలో తప్పకుండా విత్తనాల కొనుగోలు రసీదులను తీసుకోవాలని ఆయన రైతులను కోరారు. అలాగే రైతులు వివిధ గ్రామాలలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తులతో విత్తనాలు విక్రయం చేయరాదని లైసెన్సులు కలిగి ఉన్న షాపులలో మాత్రమే రైతులు విక్రయించాలని ఆయన కోరారు. పట్టా పాసు బుక్కు ఉన్న ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపె పెట్టిన అగ్రికల్చర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వినియోగించుకోవడానికి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, అరవిందు, మండల ఏ ఈ ఓ, శివకుమార్, నందకిషోర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

- మాజీ జెడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, ఆర్డీఓ మాధవి

**ఉప్పునుంతల, జూన్3 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, అచ్చం పేట ఆర్‌డిఓ మాధవిలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా మొదటి రోజు మంగళవారం మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులకు అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, మాజీ జడ్పిటిసి అనంత ప్రతాప్ రెడ్డిలు ప్రారంభించారు. సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, రైతు సోదరులతో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం ఎంతో సుగమమని వారు అన్నారు. సమస్యలు ఉన్న ప్రతి రైతు ఈ సదస్సులో పాల్గొని వారి ఇబ్బందులను అర్జీ ల ద్వారా విన్నవించుకోవాలని వారు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి తోపాటు మాజీ జెడ్పిటిసి అనంత ప్రతాప్ రెడ్డి, ఉప తహసీల్దార్ పరుష్ నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత,జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, సిబ్బంది రమణమ్మ, ఆదిత్య, మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

**పెనిమెళ్ళలో:** రెవెన్యూ శా ఖసదస్సు లో భాగంగా మండలంలోని పెనిమె ళ్ళ లో తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రమీల మాట్లాడుతూ భూ భారతి చట్టం తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, రెవెన్యూ సదస్సులను గ్రామాలలో రైతులు, ప్రజలు సకాలంలో వచ్చి తమ తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమీల తో పాటు మండల సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, సిబ్బంది శంకర్,సాయి, రాజుకుమార్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం



రైతు సదస్సు గురించి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పానగల్ జూన్ 3 ప్రభాతవార్త:** ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వనపర్తి జిల్లాలో జూన్ 3 నుంచి జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం పానగల్ మండలంలోని బండపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు ను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రెవెన్యూ అధికారులు మీ గ్రామానికి వచ్చారని, భూ సమస్యలు ఏమున్నా నిర్ణిత ప్రొఫార్మలో పూరించి అధికారులకు ఇవ్వాలని, అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. సాదా బైనామ పై వివరిస్తూ 2020 సంవత్సరంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని ఇప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, మిగిలిన సాదా బైనామా దరఖాస్తుల విష యంలో కోర్టు నుండి సూచనలు వచ్చాక పరిశీలించడం జరుగుతుందన్నారు. భూ సమస్యల పై దరఖాస్తు నింపడానికి ఇబ్బంది ఉన్న వారికి సహాయం చేసేందుకు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లను పెట్టడం జరిగిందని, వారి సహకారం పొందాలని సూచించారు.భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు చేసుకొని భూ తగాదాలు, సమస్యలు పరిష్కరించుకోవాలని గ్రామ ప్రజలను సూచించారు. షెడ్యూలు ప్రకారం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆర్డీఓ సుబ్ర మణ్యం, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఆర్.ఐ ఇతర సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలికంగా అదాయాన్ని ఇస్తుంది

- అదనపు కలెక్టర్ నర్సింగ రావు



ఆయిల్ పామ్ తోటలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అలీ అక్బర్

**గద్వాల ,జూన్3,ప్రభాతవార్త:** అయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకా లికంగా స్థిర ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మంగళవారం ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొని స్వయంగా మొక్క లు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయిల్ పామ్ సాగు ప్రాధాన్యత,దీని ద్వారా రైతులకు లభించే ఆదాయ మార్గాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.అయిల్ పామ్ ఒక శాశ్వత పెట్టుబడి లాంటి పంట – ఒకసారి నాటితే పలు సంవత్స రాలపాటు ఆదాయం ఇస్తుందని అన్నారు.ఇది నీటి వినియోగం తక్కువగా ఉండే పంటగా రైతులకు అనుకూలంగా ఉంటుందని తెలి పారు. ప్రభుత్వం ప్రోత్సాహక కార్యక్రమాల కారణంగా సాగు మరింత లాభదాయకంగా మారుతోందని అన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద నాటిన మామిడి తోటను అదనపు కలెక్టర్ పరిశీలించారు. మొక్కల పెరుగుదల,నిర్వహణ, నీటి సరఫరా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి, తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి అక్బర్,రైతులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు : పరిగి ఎమ్మెల్యే టిఆర్ఆర్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

**గండీడ్, జూన్3 ప్రభాతవార్త:** గండిడ్ మండల పరిధిలోని కొమిరెడ్డిపల్లి, కప్లాపూర్ గ్రామాలలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ళు మంజూరైన లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మో హన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కప్లాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన భూ భారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం విత్తు కొద్ది పంట" కార్యక్ర మంలో భాగంగా ఎమ్మెల్యే రైతులకు విత్తనాలను పంపిణి చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో రాజకీయాలకతీతంగా అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. భూమి ఉన్న రైతులు అనేక సమ స్యలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని దీన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించి భూ సమస్యలను శాశ్వ తంగా పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో భూసమస్యల పరిష్కారం కోసం ఎంతోమంది కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృథా చేసుకున్నారు తప్ప సమస్యలు పరిష్కరించుకోలేకపోయారని, భూభారతి ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయనీ టి ఆర్ ఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో దేవన్న, డిప్యూటీ తాసిల్దార్ మాధవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, గండేడ్ సిఎస్ఎస్ చైర్మన్ గిరి మోని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు నరసింహారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు ప్రభాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, మాజీ ఎంపిటిసిలు ఆశన్న, చిట్లపల్లి బాలయ్య, పలు శాఖల సిబ్బంది పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యంలో తరుగు తీస్తే ఫిర్యాదు చేయండి

- రైతులు ఆందోళన చెందవద్దు: పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్



కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**పానగల్, జూన్3ప్రభాతవార్త:** రైతులకు ఇబ్బందులు లేకుండా కొను గోలు కేంద్రాల్లో తొలిసారి అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి నాణ్యమైన వడ్లు సేకరించడం జరుగుతుందని పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ తెలియజేశారు. మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సెక్రెటరీ డి.ఎస్ చౌహాన్ వనపర్తి జిల్లాలో పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లుతో కలిసి పానగల్ మండలంలోని వెంగళాయ పల్లి, తెల్లరాళ్ళ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొను గోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ఒకసారి కొనుగోలు కేంద్రానికి చేరుకున్న తర్వాత పూర్తి బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి నాణ్యమైన వడ్లు సేకరించేందుకు వ్యాక్యూం పాడి క్లీనర్లు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందన్నారు. యంత్రాల ద్వారా చెత్త, తాలు, మట్టిని వేరు చేసి నాణ్యమైన వడ్లు వస్తుందని, తేమ శాతం సైతం తగ్గిస్తుందన్నారు. రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం రైతులకు అండగా ఉండి మొత్తం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. నాణ్యమైన వడ్లు మిల్లులకు ఇస్తే ఒక్క గ్రాము తరుగు చేస్తే తనకు ఫిర్యాదు చేయాలని రైతులకు భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై జగన్మోహన్ తదితరులు ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ఉన్నారు.

## ప్రజలు దైవచింతన అలవర్చుకోవాలి : మక్తల్ ఎమ్మెల్యే



గ్రామదేవతల శోభాయాత్రలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్, జూన్3, ప్రభాతవార్త;** సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మక్తల్ నియో జకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరిఅన్నారు. మున్సిపల్ కేంద్రమైన ఆత్మ కూరు పట్టణంలో గ్రామదేవతల విగ్రహావిష్కరణకు సంబంధించి మంగళ వారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దైవచింతన అలవర్చుకుంటేనే తరతమే భేదాలు లేకుండా జీవించగలుగు తామని ఆయన అన్నారు. ఆత్మ కూరు పట్టణంలో గ్రామదేవతల గుడుల పునర్నిర్మాణానికి ఆత్మకూరు పట్టణ కమిటీ ముందుకు వచ్చి ప్రారంభించడం సంతోషకరమైన విషయం అన్నారు. అంతేకాకుండా గత ఎన్నో ఏళ్లుగా పట్టణంలో నిర్వహించినటువంటి బొడ్రాతి పండుగలకు సంబంధించి గ్రామ నాది ప్రతిష్టలను ఏర్పాటు చేయాలని సంకల్పించడం దైవచింతలలో భాగమేనని ఆయన అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుండి ప్రారంభమైన గ్రామదేవతల బొడ్రాతి ఇలా ప్రారంభమైన శోభాయాత్ర పట్టణంలోని పురవీధుల గుండా నిర్వహించిన అనంతరం పెద్దమ్మ తల్లి గుడి వద్దకు చేర్చారు. పట్టణంలో మూడు రోజులపాటు కొనసాగరన్న గ్రామదేవతల పునః ప్రతిష్టతో పాటుగా బొడ్రాతి పండుగలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శోభాయాత్రను పురస్కరించుకొని ఆత్మకూరు సీఐ మహేష్ కుమార్ ఎస్సై నరేందర్ ప్రత్యేక పోలీసు బంధు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక విభాగం చైర్మన్ నాగరాజుగౌడ్,గ్రామదేవతల ఆలయాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, రాష్ట్ర బాలహక్కుల చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డితో పాటుగా పలువురు రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్కారు బడిలోనే చేర్పించండి-నాణ్యమైన విద్యను పొందండి



**అలంపూర్,జూన్ 3, ప్రభాతవార్త;** టీఎస్ యుటిఎఫ్ ఎన్రోల్మెంట్ ప్రచార జాత మంగ ళవారం అలంపూర్ మండలంలోని అలంపూర్, ఉండవెల్లి మండలం లోని ఉండ వెల్లి,బస్వాపూర్, వడ్డేపల్లి మండలం శాంతినగర్, రాజోలి మండలం సందర్శించి గ్రామస్తులను కలిసి మీ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా టీఎస్ యుటి ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ నాణ్యమైన, విలువలతో కూడిన, సమానమైన విద్య ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లల్ని చేర్పించాలని, మెరుగైన చదువుల పేరుతో ప్రైవేటు పాఠశాలల కోసం మీరు వెచ్చిస్తున్న డబ్బులను ఆదా చేసుకోండి అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు మనందరం, ప్రజలందరూ చెల్లిస్తున్న పన్నుల ఆదాయాలతోనే నడుస్తున్నాయని, అవి ప్రజలందరి ఉమ్మడి ఆస్తులని ఆ ఆస్తులని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదేనని తెలిపారు. ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వ బడులలో ఆంగ్ల మాధ్యమం ప్రారంభం అయ్యాయి,ఈసంవత్సరం ప్రభుత్వ బడులలో నర్సరీ తరగతులు ప్రారంభం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు కుమారనాయుడు, జిల్లా కార్యదర్శులు బీసన్న, తిలక్, మద్దిలేటి, మాబుసాబ్, రాముడు, వెంకట్రాముడు,సుజ్ఞానం, చిన్న మద్దిలేటి, ముస్తాక్, రాజకుమార్, మధునాయుడు, నరేష్, మునిస్వామి,సురేష్, భీమన్న, గోపిక్రిష్ణ, అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## బటదిన్నే గ్రామ రెవిన్యూ సదస్సులో 27 దరఖాస్తులు

**ఇటిక్యాల, జూన్ 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ధరణి చట్టం స్థానంలో కొత్తగా భూభారతి చట్టం గత ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి రోజున ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను జోగులాంబ గద్వాల జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇటి క్యాల మండలాన్ని ఎంపిక చేసి గత నెల మే 5వ తేదీ నుండి మే 16వ వరకు 10 రెవెన్యూ గ్రామాలలో భూ రెవెన్యూ సదస్సు లను నిర్వహించి రైతుల నుండి దరఖాస్తులు తీసుకొని అనంతరం భూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లాలోని మిగతా మండలాలలో జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాలలో అధికారులు వెళ్లి రైతుల నుండి భూ సమస్యల కోసం దరఖాస్తులు తీసుకునే కార్యక్రమం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం ఎర్రవల్లి మండలంలోని బట్లదిన్నె గ్రామంలో ఇన్చార్జిగా ఇటిక్యాల డిప్యూటీ తాహసిల్దార్ నందిని ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు.సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో వివిధ భూ సమస్యల కొరకు 27 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు దరఖాస్తులకు రసీదు ఇచ్చి వాటిని ఆన్ లైన్ లో నమోదు చేయనున్నట్లు డిప్యూటీ తాహసి ల్దార్ నందిని తెలిపారు. రెవెన్యూ సదస్సులో సీనియర్ అసిస్టెంట్ నరేష్,ఆర్ఐలు షంషేర్, శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిరేష్ బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు..

## గున్ముక్ల గుట్టలో లోగుట్టుగా అక్రమ మట్టిని తరలిస్తున్న మాఫియా

- సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్

**ధన్వాడ, జూన్3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని గున్ముక్ల గ్రామ శివారులో గల ప్రభుత్వ భూములలో లోగుట్టుగా కొందరు జెసిపి టిప్పర్ల ద్వారా మొరాన్ని తరలిస్తున్నధన్వాడ మండల రెవెన్యూ శాఖ అధికారులు పట్టించు కోవడంలేదని సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో గల సర్వే నంబర్ 144, 358 సర్వే నంబర్లలో కొందరు రాజకీయ నాయకులు మొరాన్ని ఇతర గ్రామాలకు రాత్రి సమయంలో టిప్పర్ల ద్వారా తరలి స్తున్నారు. కొందరు గుట్టను చదును చేసి ఇష్టానుసారంగా భూక బ్జాలు చేసుకుంటున్నారని ఆయన ఆరోపిం చారు.గత మూడు నెలల నుండి లోగుట్టుగా గుట్టలను తవ్వేస్తు న్నారని ఆయన ఆరోపించారు.ఇట్టి తవ్వకాలను వెంటనేనిలిపివే యకపోతే ధన్వాడ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యం లోఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు గున్ముక్ల గ్రామంలో గుట్టలను వెంటనే జిల్లా స్థాయి అధికారుల ద్వారా పరిశీలించాలన్నారు.లేనిఎడల సిపి ఆధ్వర్యంలో దశలవారీ గాఆందోళనకార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## రహదారి డ్రైనేజీల విషయంలో పట్టించుకోని అధికారులు

**ధన్వాడ, జూన్ 3 ప్రభాతవార్త:** ధన్వాడ మండలం కేంద్రంలో మారుతీనగర్ వీధి కంసంపల్లి వెళ్ళే రహదారిలో గత 20 రోజు లుగా డ్రైనేజీ పడిపోయింది. కుర్వగేరిలో పాతపల్లికి వెళ్లే దారిలో డ్రైనేజీ పైపు పగిలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారుల విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని రాత్రి వేళ్లలో ద్విచక్ర వాహనాలు తప్ప వేరే వాహనాలు వెళ్లడానికి లేకుండా మరి డ్రైనేజీ పడిపోయి ఉందని బీజేపీ మండల నాయ కులు వాపోయారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని లేనియెడల బిజెపి మండల శాఖ పెద్ద ఎత్తున రాస్తారోగా చేస్తామని ఎంపీడీవో కు వినతి పత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు శివరాజ్, మల్లయ్య, సురేందర్, చంద్రశేఖర్, రాజు, నర్సింలు పాల్గొన్నారు.

## విజయవంతంగా మూడు రోజుల ధ్యాన శిబిరం

**పెబ్బేరు, జూన్3 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలోని పార్వాత య్య కాలనీలో నిర్వహించిన మూడు రోజుల ధ్యాన మహోత్స వాలు విజయవంతంగా ముగిశాయి. హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యానోత్సవాలో ఈ మూడు రోజులు ధ్యానం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాలా మంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెబ్బేరు సెంటర్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాగశేషి, ట్రైనర్ బి.అరుణ కుమారి, మధుసూదన్ పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనం

**బిజినేపల్లి, జూన్3 ప్రభాతవార్త:** ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందజేయడమే వ్యవసాయ పరిశోధన విద్యాలయ లక్ష్యమని శాస్త్రవేత్త సుమలత అన్నారు. పాలెం గ్రామంలో రైతుల కు మంగళవారం రైతు వేదికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం తరఫున నాణ్యమైన విత్తనాలను అందించారు. ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం అనే కార్యక్రమం ప్రారంభి ంచడం జరిగిందన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కాగా 3వ తేదీన మండల స్థాయిలో రైతు నేస్తం కార్యక్రమం జరిగే రైతు వేదికలో విత్తన పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా వరి,జొన్న వంటి రకాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. బిజినపల్లి మండలంలోని 9 క్లస్టర్లకు గాను 48 వరి, 24 జొన్న రకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నీతిరెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్‌నజీర్, బలరాం గౌడ్,నరేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పరుశురాములు, ఏఈఓ విష్ణు, రైతులు ఉన్నారు.

## ఇంటింటా చెత్త సేకరణ పై అవగాహన

**నారాయణపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త:** ఇంటింటా చెత్త సేకరణ పై నారాయణపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళ వారం నారాయణపేట పట్టణంలోని ఆయా వార్డులు ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించడం, తడి చెత్త నుండి ఎరువును తయారు చేయడం ప్లాస్టిక్ వాడకుండా బట్ట సంచులను వాడకం వంటి అవగాహన కల్పించారు. అనంతరం పలువురుమాట్లాడుతూ ఇండ్ల వద్ద పరిసర ప్రాంతాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలన్నారు. తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**మానవపాడు, జూన్3 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం కర్నూల్ పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో నియోజకవర్గంలోని 80 మంది బాధితులకు రూ.21,06,700 లక్షల విలువైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంపూర్‌ను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలు ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం

**పెబ్బేరు, జూన్ 3 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామం భూభారతి రెవెన్యూ సదస్సు ను ప్రారంభించిన తహసిల్దార్ మురళిగౌడ్ వారితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. భూమి సమస్యల గురించి,ఏమైనా భూమి ఇబ్బందులు ఉంటే మార్పులు, చేర్పులు,ఉంటే తహసిల్దార్‌కి అప్లికేషన్స్ వ్రాసి ఇవ్వడం జరుగుతుంది. దీని వలన కొందరి ప్రజలకు న్యాయం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పెబ్బేరుమండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి,మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంధం రంజిత్,రెవెన్యూ సిబ్బందికి, పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులకు ఘనంగా సన్మానించడం జరిగింది. గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, ఏ.కురుమూర్తి,వెంకటరత్నం నాయుడు, ప్రభాకర్ గౌడ్, వేణుగోపాల్, లక్ష్మణ్ నాయుడు, ఆనంద్, తిరుపతి,రవి, బాలరాజు గ్రామస్తులు,యువకులు, పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**భూత్పూర్,జూన్ 3,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు అమిస్తాపూర్‌కు చెందిన గడ్డం చెన్నమ్మ అనారోగ్యం కారణంగా మృతిచెందగా,విషయం తెల్సుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మృతురాలి ఇంటికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం మృతురాలు చెన్నమ్మ కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా లిక్కి నవీన్‌గౌడ్ రు.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.నవీన్ వెంట కాంగ్రెస్ కార్యకర్తలు నిమ్మల సాయిరాం యాదవ్,శ్రీకాంత్,పవన్,శివరాములు,అఫ్రోస్ తదితరులున్నారు.

## కృష్ణ మండల నూతన తహసీల్దారుగా జె.శ్రీనివాస్

**కృష్ణ, జూన్ 3 ప్రభాతవార్త :** క్రిష్ణా మండలం నూతన తాసిల్దార్‌గా జె. శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నర్వలో విధులు నిర్వహించిన ఆయన ఉన్నతాధికారుల ఉత్తర్వుల భాగంగా ప్రస్తుతం మండల తహసిల్దార్‌గా నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన పుష్పలత మక్తల్‌కు బదిలీ అయ్యారు, సందర్భంగా నూతన తహసిల్దార్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం ఆదాయ ధ్రువపత్రాల అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యి, ప్రతి ఒక్కరూ విధులలో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.

## నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం

**కృష్ణ, జూన్3 ప్రభాతవార్త :** పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ సంవత్సరం "నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం" అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా నారాయణపేట జిల్లా, క్రిష్ణ మండలంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఈశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్రాంతీయ పరిశోధన స్థానం, పాలెం),సుదర్శన్ గౌడ్ మండల వ్యవసాయ అధికారి పాల్గొన్నారు. రైతులకు 28 కిట్లు వరి14 కిట్లు కంది పంటలకు సంబందించి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబడులు కనీసం 10 15 శాతం వరకు పెరిగే అవకాశాన్ని రైతులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ అన్నారు. రైతులు ఒకసారి నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా సేకరించి, కొన్ని సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని 23 సంవత్సరాల వరకు వాడుకోవచ్చు అన్నారు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురు నుండి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందించబడుతుందన్నారు. ఈ విధంగా విత్తన సాంకేతికతను గ్రామస్థాయికి తీసుకువెళ్లడం ద్వారా, రానున్న రెండు మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే గాక తెలంగాణ రాష్ట్రాన్నివిత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యం తో ఈ కార్యక్రమంముందుకు సాగుతుందనిమండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ అన్నారు.

## మూడు నెలల రేషన్ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినిచేసుకోవాలి

**అయిజ, జూన్3,ప్రభాతవార్త;** ప్రభుత్వం అందించే ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారుడు సద్వినం చేసుకోవాలని మండల ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దార్ ప్రశాంత్ గౌడు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎ క్లాసు పురం గ్రామంలో రేషన్ షాప్ యందు మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బియ్యం ప్రతి ఒక్కరు సద్విని చేసుకోవాలని ఇందులో అందించే పోషక విలువలతో కూడిన బియ్యాన్ని వేరు చేయకుండా అందులోనే కలిపి వండుకోవాలని సూచించారు దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లబ్ధిదారులకు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందించే మూడు నెలల సరిపడా బియ్యాన్ని సమగ్రంగా నిర్వహించాలని రేషన్ డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ భరత్ కుమార్, పంచాయతి కార్యదర్శి రంగన్న, మరియు స్థానిక డీలర్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించండి

**ఇటిక్యాల, జూన్ 3 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలోనే నాన్నమైన విద్య నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్ కిరణ్. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, బీసన్న, రాధమ్మ గ్రామ పెద్దలు గ్రామంలో పలు కాలనిలలో పర్యటిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా మునగాల ప్రాథమిక పాఠశాల తరపున బడిఈడు గల పిల్లలను బడిలో చేర్పించాలని కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు. గ్రామ కార్యదర్శి గంగాధర్. అంగన్వాడీ టీచర్. ఆశా కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

**మక్తల్ టౌన్,జూన్ 3 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులకు రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ సాధారణ నిధులు జీతభత్యాలకు వినియోగించిన తర్వాతనే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలనే ప్రాథమిక సూత్రాన్ని అమలు చేసి వెంటనే పరిష్కరించాలని మక్తల్ శాసనసభ్యులువాకిటి శ్రీహరి మక్తల్ టియుసిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం

**బిజినేపల్లి,జూన్ 3 ప్రభాతవార్త :**భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయిందని తహసిల్దార్ సిహెచ్ రవికుమార్ అన్నారు. అల్లీపూర్, ధర్మాపూర్, బోయాపూర్ గ్రామాల్లో మంగళవారం భూభారతి చట్టం రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. తహసిల్దార్ సిహెచ్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి తోడ్పడతాయన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ కీలకంగా మారిందని చెప్పారు. అన్యాయం జరిగితే ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ స్థాయిల్లోనూ అప్పిలు చేసుకునే అవకాశం భూభారతి చట్టంలో కల్పించారని వివరించారు. భూభారతిచట్టం రావడం వల్లరైతుల సమస్యలు పరిష్కారం త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బుధవారం గంగారం గుడ్ల నర్వ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు వివరించారు. సదస్సులో పిఎసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, దాసర్ల సైదులు, వెంకటస్వామి రెవిన్యూ సిబ్బంది భారతి భాయ్ రేఖ తేజస్విని రాఘవేందర్ నిరంజన్ బాలరాజ్ అరుణ మాధవి రమేష్ శ్రీహరి పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు సాగు చేసి పంట దిగుబడులు సాధించాలి

**ఇటిక్యాల, జూన్ 3 ప్రభాతవార్త :** రైతులు ఖరీఫ్ సీజన్ లో నాణ్యమైన విత్తనాలు సాగు చేసి మంచి యాజమాన్య పద్ధతులు పాటించి పంట పండించిన తర్వాత గ్రామంలోని ఇతర రైతులుకు విత్తనం కొరకు పంచాలని దీనిద్వారా నకిలీ విత్తనాల నుండి బయటపడవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శంకర్ మండల వ్యవసాయ అధికారి రవికుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పుటాన్ దొడ్డి రైతు వేదికలో ఎర్రవల్లి. ఇటిక్యాల 2 మండలాలకు చెందిన ఎంపిక చేసిన రైతులకు 49 మందిలో 42 మందికి వరి ఆర్ ఎన్ఆర్ 15048 అనే రకం విత్తనం. మరో 7 మంది రైతులకు జొన్న పివైపిఎస్ 2 అనే రకం నాణ్యమైన విత్తన కిట్ల ప్యాకెట్లను వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శంకర్ ఉద్యాన శాస్త్రవేత్త కెవికె మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. గోపి. డా.ఆల్దాస్ జానయ్య, శాస్త్రవేత్తలు అధికారులు రైతులతో ఖరీఫ్ సీజన్లో పంటల సాగుపై తీసుకోవలసిన చర్యలు సూచనలు సలహాలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ఏఈవోలు. ప్రవళిక, వేదవతి, సంధ్యారాణి, సంధ్య, మానస, కవితా రాణి, నరేష్, వెంకటేష్, జెన్నిఫర్, సురేందర్ 2 మండలాల రైతులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో రోడ్డుకు పడ్డ గుంతలకు మరమ్మత్తులు

**గద్వాల, జూన్ 3,ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలోని రోడ్లన్ని గుంతల మయంగా మారాయి. కృష్ణవేణి చౌక్ లో పడ్డ గుంతలను పూడ్చారు. కృష్ణవేణి చౌక్ నుండి నది అగ్రహారం వెళ్లే రహదారి అక్కడక్కడ లోతుగా గుంతలు పడి ప్రమాద భరితంగా మారింది. అదే దారిలో తరచూ భీమ్ నగర్, పాత హౌసింగ్ బోర్డ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, నది అగ్రహారం వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదానికి గురైన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ సమస్యను మున్సిపల్ అధికారులకు, నాయకులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదు. అహ్మద్ టిఫిన్ సెంటర్, ఎదురుగా రోడ్డుకు పడిన లోతైన గుంతను మంగళవారం అహ్మద్ టిఫిన్ సెంటర్ బిల్డింగ్ యజమాని మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, శివాని సూపర్ మార్కెట్ యజమాని భాస్కర్ తమ సొంత ఖర్చులతో రోడ్డుకు పడిన గుంతలను సిమెంట్ కాంక్రీట్ తో మరమ్మతు చేయించారు. ఈ రోడ్డు మరమ్మత్తు చేసిన వారు అహ్మద్ టిఫిన్ సెంటర్ యజమాని అహ్మద్, టిఫిన్ సెంటర్లో పనిచేసే కార్మికులు దౌలత్, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

# ఎలాంటి గందరగోళం లేదు


విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పిన మాట అక్షరాల వాస్తవం
- డిజైన్‌లోనే పాతబజారుకు రోడ్డు ఉన్నది
- తేల్చి చెప్పిన ఎన్‌హెచ్‌ఏ అధికారులు

**జడ్చర్ల, జూన్3, ప్రభాతవార్త:** పాత బజారు రోడ్డు విషయంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పింది అక్షరాల నిజం అని నేషనల్ హైవే అథారిటీ అధికారులు తేల్చి చెప్పారు. ఇదే విషయం వారు కాంగ్రెస్ నాయకుల ప్రెస్ మీట్ లో బహిర్గతం కావడంతో ఏం మాట్లాడాలో తెలియని పరిస్థితి నెలకొంది... వివరాల్లోకి వెళ్తే జడ్చర్లలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గతంలో జడ్చర్ల మీదుగా కోదాడ వరకు వెళ్తున్న 167వ జాతీయ రహదారి విషయంలో లక్ష్మారెడ్డి హయాంలోనే అంబేద్కర్ సర్కిల్ నుంచి పాత బజారుకు వెళ్లే రోడ్డు విషయంలో గందరగోళంఏర్పడిందని,పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని చెప్పే ప్రయత్నం చేశారు. పాత బజారుకుహెవీ వెహికిల్స్ వెళ్లడానికి ఆస్కారంలేకుండా పోయిందని, పాత బజార్‌కు వెళ్లే రోడ్డు విషయంలో ఇప్పటికీ బి ఆర్ ఎస్ నాయకులకు అధికారులకు స్పష్టత లేదు అని చెప్పే ప్రయత్నం చేశారు. ఇదే విషయాన్ని నేషనల్ హైవే అధికారుల ద్వారాస్పష్టం చేస్తామని వారికి ఫోన్ చేసే ప్రయత్నం చేశారు. అయితే నేషనల్ అధికారులు చెప్పిన మాటలకు కాంగ్రెస్ నాయకులు ఖంగుతిన్నారు. పాత బజారుకు వెళ్లే రోడ్డు విషయంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పినమాటలు అక్షరాల వాస్తవంఅని, ఎలాంటి గందరగోళం లేదుఅని స్పష్టం చేశారు. పాత బజారుకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండానే డిజైన్ లో మార్పు చేయడం జరిగిందని అదే డిజైన్‌కు అనుగుణంగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని తేల్చి చెప్పారు. ఇదే విషయం ఫోన్లో లౌడ్ స్పీకర్ ద్వారా అందరికీ వినిపించడంతో ఇక చేసేదేమీ లేక అయోమయంలో పడ్డారు. అయితే నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాట మార్చి చెబుతున్నారని తమకు తెలిసినంతవరకు పాత బజారుకు వెళ్లేందుకు రోడ్డు విషయంలో కొంతగాఅందరి గోళం ఉందని చెప్పుకొచ్చారు.నిత్యానందం, మాజీఎంపీపీ, సయ్యద్ మిన్హాజ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అశోక్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, రవి శంకర్ మాజీ ఎంపీటీసీ, రాజు గౌడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్,వనం క్రిష్ణయ్య మార్కెట్‌కమిటీ డైరెక్టర్, నర్సింహులు యాదవ్, పెద్దఆదిరాల సత్యం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గోపాల్ యాదవ్, కొండేడ్ రవి పాల్గొన్నారు.

## రైతన్న నేస్తం పథకం ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్


రైతు నేస్తం విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్

**పెబ్బేరు, జూన్3 ప్రభాతవార్త :** పంటల సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ సంవత్సరం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే ఒక పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ప్రతి గ్రామానికి విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ విత్తనాలు సాగు చేసిన రైతులు రెండు మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చు.ఎంపిక చేయబడిన రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వబడుతాయి. ఈ పథకం ద్వారా రానున్న రెండు మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామన విత్తన స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నది ప్రభుత్వ లక్ష్యం ప్రతి గ్రామానికి సృష్టమైన మంచి విత్తనం అందాల అన్నది లక్ష్యం. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామంలో రైతు వేదిక దగ్గర మండలంలోని ఉన్న గ్రామాలు తోమాలపల్లి, రామమ్మపేట, కంచిరావుపల్లి, పెంచికలపాడు, భూనాదిపురం వివిధ గ్రామాలకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. వడ్లు, పచ్చజొన్నపంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో పెబ్బేర్ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, అగ్రికల్చర్ ఏవో మున్న, పాలెం శాస్త్రవేత్త శ్రీరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, వెంకట్ రాములు, రంజిత్ కుమార్ జగదీశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు బాలగౌడు,రాములు, సోమన్న, భాస్కర్, ఏ ఈఓలు చక్రవర్తి, ఆంజనేయులు, రజిత పాల్గొన్నారు.

## మండల కేంద్రంగా ప్రకటించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మెట్టుపల్లి గ్రామస్తులు

**బిజినపల్లి, జూన్ 3 ప్రభాతవార్త:** లట్టుపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన గ్రామస్తులు గత 12 సంవత్సరాల క్రితమే లట్టుపల్లిని మండల కేంద్రంగా ప్రకటించమని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకరావడం జరిగింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతమైన తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని రిలే నిరాహార దీక్షలు చేసిన తరుణంలో హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అత్యధికంగా గిరిజన గ్రామ పంచాయతీలతోపాటు పెద్ద ఎత్తున గిరిజనులు అటవీ ప్రాంతం ఉన్న లట్టుపల్లిని మండల కేంద్రంగా ప్రకటిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. లట్టుపల్లి గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మంగనూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించడానికి ప్రభుత్వం దృష్టికి నివేదిక తీసుకెళ్లడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామస్తులు మూకుమ్మడిగా తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలను కలుపుకొని మండల కేంద్రంగా ప్రకటిస్తే గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేయడానికి అవకాశం లేకపోలేదన్నారు. మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల ఆర్థికంగా రాజకీయంగా విద్యాపరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధికి నోచుకుంటుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గోవింద్ నాయక్, ప్రేమ్‌లాల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాసులు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గ్రామదేవతల శోభాయాత్ర

**ఆత్మకూర్ ,జూన్ 3 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణంతో పాటుగా గ్రామదేవతలైన కట్టమైసమ్మ, పోచమ్మ, కర్రెమ్మ, తదితర గ్రామదేవతల శోభాయాత్ర మంగళవారం రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ముందుగా పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గ్రామ దేవతలను గత రాత్రి నుండి అక్కడే ఉంచి మంగళవారం సాయంత్రం వేద మంత్రో చరణాల మధ్య పూజారులు గ్రామదేవతలను పట్టణంలోని పురవీధుల గుండా శోభాయాత్రగా నిర్వహించి గ్రామదేవతలకునూతనంగా నిర్మించినటువంటి ఆలయాలలో ప్రతిష్ట చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు గడచిన నెల రోజుల నుండి గ్రామదేవతల గుడుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపతి కన్నా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులకు మంగళవారం రోజు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గారి లక్ష్మీనారాయణ 5 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు మంగళవారం రోజు ప్రారంభమైన గ్రామ దేవతలపునః ప్రతిష్టతో పాటుగా బుధవారం మరియు గురువారం వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామా దేవతల ప్రతిష్టతో పాటుగా బొడ్రాతి ప్రతిష్టకు పట్టణంలోని భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## బండలయ్య గట్టుపై ప్రారంభమైన మహోత్సవాలు

**గద్వాల, జూన్ 3,ప్రభాతవార్త:** బండలసోమేశ్వరస్వామి, చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ప్రారంభయ్యాయి. గద్వాల మండలం లతీపురం గ్రామ శివారులోని బండ్లయ్య గట్టుపై దాతలసహకారంతో నిర్మించిన బండలసోమేశ్వ! స్వామి ఆలయం, చౌడేశ్వరి అమ్మవారి యాల్లో మంగళవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వ హించనున్నట్లు భక్త బృందం సభ్యులు సత్యారెడ్డి, పురోహితుడు ప్రమోదయ్యా తెలిపారు.మంగళవారం ఉదయం గణప తిపూజ, పుణ్యాహవచనం,యాగశాల ప్రవేశం,షోడశస్తంభపూజ, రుత్విగ్వరణం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, దేవతస్థాపనం, జలాదివాసం, ప్రదోషపూజ, మహా మంగళహారతి, స్వస్తి,తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 4న అవాహిత దేవతా హవనములు, మహాస్నపనం, ధాన్యాధి వాసం, 5న యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, జ్వాలాదర్శనం, గోదర్శనం, బలి దానం తదితర కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయంలో 3 రోజుల పాటు రోజూ మధ్యాహ్నం 1గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

## ఘనంగా గ్రామదేవతలకు పూజలు

**కృష్ణ, మే 3 ప్రభాతవవార్త :** కృష్ణ మండలం, గుడేబల్లూరు గ్రామ ప్రజలు ప్రతియేటా లాగే ఈ సంవత్సరం కూడా గ్రామ దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఇక్కడ ప్రజలు ప్రతి సంవత్సరం ఏరువాక పౌర్ణమి కి ముందు, సుగ్గి (పంటలు ప్రారంభంఅయ్యే దశ) ఆరంభంలో ఈ వేడుకలు జరుపుకుంటారు.ఈ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించడంలో ముఖ్యంగా గ్రామంలో ఏడు మేటీలుగా (వర్గాలు) ఉంటారు.అందులో బోయిని వాళ్లు, కసనగారి వాళ్లు, పతంగి వాళ్లు, బొల్లవాళ్లు, ముష్క వాళ్లు, లింగయత్‌లు, మ్యాతర్లు కీలక పాత్ర పోషిస్తారు. పేరుకు వర్గాలుగా ఉన్నప్పటికీ, గ్రామదేవతలకు అందరూ కలిసికట్టుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పూజ వేడుకలు నిర్వహించే ఒక రోజు ముందే కావల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. మరుసటి రోజు ఉదయాన్నే అన్ని మేటీలకు సంబందించిన యువకులు నదికి వెళ్లి స్నానం ఆచరించి, గంద్రు గొడ్డళ్ళు, తల్వార్లకు నిమ్మకాయలు అమర్చి,నదినీటితో నింపిన బిందెలకు పూజలు చేస్తారు. తదనంతరం నది నుంచి పాదయాత్రగా వచ్చి గ్రామంలో వెలసిన గ్రామదేవతలు ఊర మారెమ్మ, లక్ష్మవ్వ, పోలమొవ్వ, మైసమవ్వ, గట్టు మారెమ్మలకు ప్రదక్షిణాలు అనంతరం అభిషేకం చేస్తారు. ఈ పూజా కార్యక్రమంలో భాగమైన అభిషేకం, నైవేద్యం సమర్పణ ను గ్రామంలోని వాకిటి వాళ్లు దగ్గరుండి నిర్వహిస్తారు. ఇక్కడి ప్రజలు ప్రతీ సంవత్సరం ముంగరు(వర్షాకాలం ఆరంభంలో) ఈ పండుగను జరుపుకుంటారు. గ్రామంలోని ప్రజలు పాడి పంటలతో, సుఖశాంతులతోఈ ప్రాంతం విరజిల్లాలని మొక్కులు మొక్కుకుంటారు. గ్రామంలో వెలసిన గ్రామదేవతలను ఆ ఊరికి రక్షణ కవచాలుగా అక్కడి ప్రజలు భావిస్తారు.

## కుక్కకాటుపై అవగాహన

**పెబ్బేరు, జూన్ 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశముల మేరకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళ వారం రోజున 12 వ వార్డులో కుక్క కాటుపై అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగినది. మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లలనువిది కుక్కలకుదూరంగా ఉంచాలని,కుక్కలు సామాన్యంగా దాడి చేయవని, ఒకవేళ కుక్క కరిస్తే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం 12 వ వార్డులో ఇంటింటికీ తిరిగిడెంగ్యూ మలేరియా వ్యాదులనివారణ అవగాహన, డ్రైడే యాక్టివిటీ కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి నిర్వహించడం జరిగినది.ఇంటి పరిసరాలలో మురుగు నీరు నిలవఉండకుండా ఉంచుకోవాలన్నారు. పరిసరాల శుభ్రత తోనే డెంగ్యూ మలేరియా వ్యాదులను రాకుండా అరికట్టగలమన్నారు.మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,వార్డ్ ఆఫీసర్‌లు, మున్సిపల్ సిబ్బంది,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రైతులకు వరి విత్తనాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న పంట బీమాను బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసిందని, రాష్ట్ర ముఖ్య మంత్రి పంట బీమా పథకాన్ని పునరుద్ధరించడంతో ఇటీవల నాలుగు మండలాలలో 2333 ఎకరాలలో అకాల వర్షాలు వడగండ్లకు రైతులు పంటలు నష్టపోతే, పంట బీమా పరిహారాన్ని ప్రభుత్వం రైతులకు అందజేసిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి యాసంగిలో కోయిల్ సాగర్‌కు నీళ్లు తీసుకువచ్చామని, మన ప్రజా ప్రభుత్వంపై దేవుడి ఆశీస్సులతో 1984 తర్వాత రోహిణి కార్తిలో వర్షాలు కురవడంతో జూన్ మొదటి వారంలోనే నిన్న ఉంద్యాల పంప్ హౌస్ నుండి కోయిల్ సాగర్‌కి నీళ్లు వదిలామన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో మూడు సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే రైతులకు లో వోల్టేజ్ సమస్య రాకూడదన్న ఉద్దేశంతో రైతులకు 150 ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ చేయడంజరిగిందని, అదేవిధంగా 13 కొత్త సబ్ స్టేషన్లను తీసుకురావడం జరిగిందని, వాటితో పాటు 133కెవి సబ్ స్టేషన్‌ను సైతం మంజూరు చేయించడం జరిగిందని, ఈ సబ్ స్టేషన్లకు ఈనెల 6వ తేదీన ఉపముఖ్య మంత్రి భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారని అన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమం లో. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి,కౌకుంట్ల మండల పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షులు అంజిల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, పట్టణ అధ్యక్షులు ఫారుక్‌అలి, జికెఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోన రాజశేఖర్, మండల కాంగ్రెస్ కార్యకర్తలు మరియు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది

(మొదటి పేజీ తరువాయి)

జరగడం గర్వంగా ఉందని కరాటే శిక్షణ ఇచ్చిన హోంగార్డ్ శ్రీనివాసులును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ విధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశా లలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కరాటే ఉచితశిక్షణ విద్యార్థిని విద్యార్థులకు నేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ,నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు,అప్పలనాయుడు,శ్రీనివాస్, క్లూస్ టీం ఎస్సై,రవిసాగర్, శిక్షణ ఎస్సైలు, వేణుగోపాల్, దివ్యా, హోంగార్డ్ శ్రీనివాసులు పోలీస్ సిబ్బంది కరాటే శిక్షణ విద్యార్థులు ఉన్నారు.

## పోలీసు పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, జూన్3 ప్రభాతవార్త:** మంగళవారం రోజు వనపర్తి మండలంరాజపేట గ్రామ శివారులో గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల పక్కన నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ పెట్రోల్ బంక్ నిర్మాణం పనులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు.నిర్మాణం పనుల్లో రాజీపడొద్దని నాణ్యతగా ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వినియోగదారుల అభీష్టం మేరకు నాణ్యతతో కూడిన ఇంధనం సరఫరా జరుగుతుందని ఇందుకు సంబంధించిన పోలీసు శాఖ పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని ఆయన అన్నారు. నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేసి పెట్రోల్ పంపు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో వనపర్తి సిఐ, కృష్ణయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, వనపర్తి రూరల్ ఎస్సై, జలంధర్ రెడ్డి, మిషన్ భగీరథ డీఈ విజయ కుమార్, సైట్ ఇంజనీర్, నరేష్, ఏఆర్ఎస్సై, నాగరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్యాధికారి రాహుల్‌కు ఘన సన్మానం

**చిన్నచింతకుంట, జూన్3 ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి బదిలీలు తప్పవని వైద్య అధికారి శిరీష అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండేళ్లుగా వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాహుల్ బదిలీపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వెళ్లడంతో మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శిరీష వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్యాధికారి రాహుల్‌ను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.అదేవిధంగా చిన్నచింతకుంట మండల పాత్రికేయుడు సి. ప్రేమ్ కుమార్. మండల టిఆర్ఎస్ నాయకులుఎస్ఐఆర్నాల్డ్ శాలువాతో ఘనంగాసన్మానించారు. వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో విధుల నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి ఒక్కరికి బదిలీలు తప్పవని ఆమె అన్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా వైద్యాధికారి రాహుల్ విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలను మర్చిపోలేనివనిఆమె కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ శోభా రాణి,ఎంపిహెచ్ ఈఓ ఆంజనేయులు హెల్త్ సూపర్ వైజార్లు అబ్బాస్, జగదీశ్వరి, సత్యమ్మ, స్టాఫ్ నర్సులు పి.అనిత, ఎన్సిడి స్టాఫ్ నర్స్ ఎ.అనిత, ఏఎన్ఎం పద్మావతి ఆయా గ్రామాల ఏఎన్ఎంలు ఎల్‌డిసి కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసులు, డిఇఓ ప్రవీణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ మునేశ్వరి అటెండర్ యాదయ్య, ఆనంద్, రజియా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు

**నారాయణపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త:** పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొంది విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతిఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను పొందాలని కోరుతూ మంగళవారం దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అధ్యాపకులు అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందిచే దామరగిద్ద మండలం గడి ముస్కన్ పల్లి ఉడుమల గిద్ద, లింగరెడ్డిపల్లి తదితర గ్రామాలను సందర్శించి పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న వసతుల గురించి తెలియజేశారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోవిద్యాబోధన ఉందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత అడ్మిషన్లు, తోబాటు ఉపకార వేతనం తదితర సౌకర్యాల గురించి వివరించారు. కళాశాలలో చదివే విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ మీడియం బోధన సౌకర్యం, కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన ఉంటుందన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ ఈ సి తెలుగు, ఇంగ్లీష్ మీటియంలో ప్రవేశాలు పొందాలన్నారు. అవకాశాన్ని పదవ తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి, కృష్ణ జగదీష్ హనుమంతు నజీర్ రవి రషీద్ తో పాటు తదితరులు ఉన్నారు

## మూసాపేట్ బూత్, మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం

**మూసాపేట, జూన్ 3 ప్రభాతవార్త :** మండలంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి మహబూబ్‌నగర్ పార్లమెంటు కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వవారు మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి 17 నెలలైనా ఇంకా ఎన్నికలు నిర్వహించట్లేదంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించక గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు అప్పులు చేసి మరి పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ఎంపీ నిధుల నుండే చాలావరకు గ్రామపంచాయతీలకు పనుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో లక్షల కోట్ల అవినీతి చేసిన కెసిఆర్,కేటీఆర్‌లను జైలులో వేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడేమో ఇద్దరు కుమ్మక్కై అవినీతి సొమ్మును పంచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల అధ్యక్షుడు రమేష్, మూసాపేట మండల అధ్యక్షుడు టీకే నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి,గట్టు మల్లేష్, సుధాకర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, కొండా రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మి, అశోక్ రెడ్డి, సుందరయ్య, రఘువర్ధన్ రెడ్డి, రవీందర్ గౌడ్, చెన్న గౌడ్, రచల రంజిత్, మహేష్, డాబా రాజు, గుడిబండ రవి, కరుణాకర్‌రెడ్డి, చందు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.